సాక్షి
ప్రకాశం
మంగళవారం । 4 । ఏప్రిల్ । 2023



మెసేజ్‌లతో వల.. ఖాతాలో లక్ష మాయం

సైబర్ నేరగాళ్లు మెసేజ్‌లతో వలవేసి ఓ వ్యక్తి బ్యాంకు ఖాతాలో రూ.లక్ష కాజేశారు. - 8లో..



జీవిత ప్రయాణంలో తిరిగిరాని లోకాలకు..

కారు చెట్టును ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
35 /27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కబోతగా ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం.

రంజాన్ వేళలు


ఇఫ్తార్ : సా॥ 06:28 ని॥
మంగళవారం

సహర్ : ఉ॥ 04:42 ని॥
బుధవారం

ముంగిట్లో సుపరిపాలన

సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టి ఏడాది పూర్తవుతోంది. పాలన, అభివృద్ధిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. కలెక్టర్, ఎస్పీ, ఆర్డీవో, మిగిలిన డివిజన్ స్థాయి అధికారుల పరిధులు తగ్గిపోయాయి. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేలా నిరంతరం పర్యవేక్షించేందుకు వీలవుతోంది. పథకాల అమలు నుంచి అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారం వంటి వాటికి మరింత సౌలభ్యం లభించింది. 8 నియోజకవర్గాలు, 38 మండలాలతో కొత్తగా ప్రకాశం జిల్లా ఆవిర్భవించగా కనిగిరి కేంద్రంగా కొత్తగా రెవెన్యూ డివిజన్, పోలీస్ సబ్‌డివిజన్లు ఏర్పాటయ్యాయి. రాష్ట్రంలోనే విస్తీర్ణపరంగా ప్రకాశం అతి పెద్ద జిల్లాగా నిలిచింది. అధిక జనాభా, మండలాలు కలిగిన జిల్లాల్లో ప్రకాశం రెండో స్థానంలో నిలిచింది.

- కొత్త జిల్లాల ఏర్పాటుతో సౌలభ్యమైన పాలన
- 8 నియోజకవర్గాలు...38 మండలాలతో అతి పెద్ద జిల్లాగా ప్రకాశం
- ఉమ్మడి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలు పక్క జిల్లాలకు
- పథకాల అమలు, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి
- జిల్లాల పునర్విభజన జరిగి నేటికి ఏడాది



ఒంగోలు/ఒంగోలు అర్బన్: మెరుగైన పాలన, సేవలు అందించాలన్న ఉద్దేశంతో చేపట్టిన జిల్లాల పునర్విభజన సత్ఫలితాలనిస్తోంది. అధికార యంత్రాంగం ప్రజలకు మరింత చేరువైంది. పక్కా ప్రణాళికతో ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించేందుకు మార్గం సుగమమైంది. ఉమ్మడి ప్రకాశంలో 12 నియోజకవర్గాలు, 56 మండలాలు ఉండేవి. వాటిలో కందుకూరు నెల్లూరు జిల్లాలో, చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాలను కొత్తగా ఏర్పాటు చేసిన బాపట్ల జిల్లాలో కలిపారు. దీంతో ప్రకాశం జిల్లా 8 నియోజకవర్గాలు, 38 మండలాలతో కొత్త రూపు సంతరించుకుంది. ప్రస్తుత జిల్లా 14,323 చదరపు కిలోమీటర్ల విశాలమైన భూ విస్తీర్ణంతో ఒంగోలు, మార్కాపురం, కనిగిరి మూడు రెవెన్యూ డివిజన్‌లతో పాలన మరింత చేరువైంది. నియోజకవర్గాలు, మండలాలు తగ్గడంతో పాలన మరింత పటిష్టమైంది. ఇప్పటికే ఉద్యోగుల సర్దుబాటు చేయడంతో ఏ జిల్లా పాలన ఆ జిల్లాలకు పరిమితమైంది. ఒక్క జిల్లా పరిషత్ శాఖ మినహా ఇతర శాఖలన్నీ ఏజిల్లాకు ఆ జిల్లాలోనే పాలన జరుగుతోంది.

మారిన పోలీస్‌శాఖ రూపురేఖలు

జిల్లాల పునర్విభజన తర్వాత జిల్లాలో పోలీస్ శాఖ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. కొత్తగా కనిగిరి సబ్‌డివిజన్ ఏర్పాటైంది. కొండపి, కంభం, త్రిపురాంతకం కొత్త సర్కిల్స్ వచ్చాయి. చీరాల సబ్‌డివిజన్ పూర్తిగా బాపట్ల జిల్లా పరిధిలోకి వెళ్లిపోయింది. కందుకూరు సబ్‌డివిజన్ పరిధిలోని కనిగిరి, పామూరు, సింగరాయకొండ, నూతనంగా ఏర్పాటైన కొండపి సర్కిల్‌ను కలుపుతూ కనిగిరి సబ్‌డివిజన్‌ను ఏర్పాటు చేశారు. దర్శి సబ్‌డివిన్ పరిధిలో దర్శి, త్రిపురాంతకం, యర్రగొండపాలెం సర్కిళ్లు, మార్కాపురం సబ్‌డివిజన్‌లో మార్కాపురం పట్టణం, మార్కాపురం గ్రామీణ, పొదిలి, పామూరు, గిద్దలూరు, కంభం సర్కిల్స్ ఉన్నాయి. ఒంగోలు సబ్‌డివిజన్‌లో ఒంగోలు వన్ టౌన్, తాలుకా, రూరల్ సర్కిళ్లు ఉన్నాయి. కొత్త డివిజన్, సర్కిల్స్ ఏర్పాటుతో ప్రజలకు మరింత వేగంగా పోలీస్ సేవలు అందుతున్నాయి. గతంలో ఎస్పీ జిల్లా పర్యటించాలంటే ఇబ్బందిగా ఉండేది. పునర్విభజనతో జిల్లా పరిధి తగ్గిపోవడంతో శాంతి భద్రతలపై పూర్తి స్థాయిలో దృష్టిసారించే అవకాశం లభించింది. ప్రస్తుతం జిల్లాను ఈజీగా చుట్టి వచ్చేస్తున్నారు.

జిల్లా విభజనపై బాలినేని ప్రత్యేక పట్టు:

జిల్లా పునర్విభజన విషయంలో బాలినేని పట్టుసాధించారు. పార్లమెంట్ నియోజకవర్గం వారీగా జిల్లాలను విభజిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గం బాపట్ల జిల్లా పరిధిలోకి వెళ్లాల్సి ఉంది. తాగు, సాగు నీటి వనరులు అయిన రామతీర్థం రిజర్వాయరు, గుండ్లకమ్మ ప్రాజెక్టులు రెండూ ఈ నియోజకవర్గం పరిధిలో ఉన్నాయి. అంతే కాకుండా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గ్రానైట్ గెలాక్సీ (చీమకుర్తి), మద్దిపాడు ఇండస్ట్రియల్ గ్రోత్ సెంటర్, పేర్నమిట్ట వద్ద ఇండస్ట్రియల్ గ్రోత్ సెంటర్లు ఇందులోనే ఉన్నాయి. ఈ నియోజకవర్గం ఒంగోలుకు సమీపంలో ఉంది. దీనిని బాపట్ల జిల్లాలో కలిపితే ప్రధాన ఆదాయ వనరులు కూడా గణనీయంగా తగ్గుముఖం పట్టే పరిస్థితి. ఈ నేపథ్యంలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ చూపి సీఎం దృష్టికి సమస్యలను తీసుకెళ్లారు. అన్ని విషయాలను పరిగణలోకి తీసుకుని సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఒంగోలులో ఉంచారు.

ఉమ్మడి జిల్లా ఇలా

1970లో గుంటూరు, నెల్లూరు, కర్నూలు జిల్లాల నుంచి విడిపోయి ఒంగోలు జిల్లా ఏర్పడింది. 1972లో ఈ జిల్లాకు ప్రకాశం పంతులు పేరుమీదుగా ప్రకాశం జిల్లాగా నామకరణం చేశారు. పునర్విభజనకు ముందు 56 మండలాలు జిల్లాలో ఉండగా ప్రస్తుతం 38 మండలాలు ఉన్నాయి. తాజాగా ఒంగోలు అర్బన్ మండలం ఒకదానిని ప్రకటించారు. విస్తీర్ణాన్ని పరిశీలిస్తే 14,322 చదరపు కిలోమీటర్లు ఉంది. 2022 జనాభా లెక్కల ప్రకారం 22.88 లక్షల మంది జనాభా నివాసం ఉంటున్నారు. ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో ఉన్న ఏకైక నగరపాలక సంస్థ ఒంగోలు మాత్రమే. మార్కాపురం మున్సిపాలిటీ కాగా, దర్శి, గిద్దలూరు, పొదిలి, కనిగిరి, చీమకుర్తి నగర పంచాయతీలు, 715 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గతంలో ఒంగోలు, కందుకూరు, మార్కాపురం రెవెన్యూ డివిజన్లు ఉండగా ప్రస్తుతం ఒంగోలు, కనిగిరి, మార్కాపురం రెవెన్యూ డివిజన్లుగా మార్పు చేశారు. ఒంగోలులో 12, కనిగిరిలో 13, మార్కాపురంలో 13 మండలాలు ఉన్నాయి. ఇక ఒంగోలు పార్లమెంట్ పరిధిలో ఒంగోలు, కొండపి, దర్శి, కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు, వై.పాలెం తోపాటు బాపట్ల పార్లమెంట్ పరిధిలోని సంతనూతలపాడు నియోజకవర్గాలు ఉన్నాయి.



కాఫీ విత్ కలెక్టర్ కార్యక్రమంలో ప్రభుత్వ వసతి గృహం విద్యార్థులతో ఇంట్రాక్ట్ అవుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్ (ఫైల్)

- కొత్త జిల్లాగా ఏర్పడిన తర్వాత కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పలు వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పల్లె నిద్ర కార్యక్రమం ద్వారా స్థానికంగా సమస్యలు తెలుసుకుంటూనే విద్యార్థులకు కెరియర్‌పై ప్రత్యేక దృష్టిసారించారు. కాఫీ విత్ కలెక్టర్ ద్వారా విద్యార్థులను ప్రోత్సహిస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు. మార్గదర్శిని పేరుతో 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉన్న విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ కార్యక్రమాలు చేపట్టారు. 592 విద్యా సంస్థలకు సంబంధించి 52,361 మంది విద్యార్థులకు ఈ కార్యక్రమం ఉపకరించింది.
- జిల్లాలో ఈ ఏడాదిలో 9 ఉద్యోగ మేళాలు నిర్వహించి సుమారు వెయ్యి మందికి ఉపాధి కల్పించారు.
- ఎస్సీ, ఎస్టీలకు, దివ్యాంగులకు ప్రత్యేక స్పందన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆయా కార్యక్రమాల్లో వచ్చిన 12,019 అర్జీలను పరిష్కరించారు.
- వైఎస్సార్ జలకళ ద్వారా ఈ ఏడాదిలో రూ.11.17 కోట్లతో 2823 వ్యవసాయ బోర్లను ఏర్పాటు చేసి రైతాంగానికి అండగా నిలిచారు. ఉపాధి హామీ పథకం ద్వారా 1.66 కోట్ల పనిదినాలతో 5,85,992 మందికి లబ్ధి చేకూరింది.
- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా 37,973 మందికి రూ.99 కోట్లతో ఉచిత శస్త్ర చికిత్సలు అందాయి.
- మార్కాపురంలో రూ.475 కోట్లతో 50.33 ఎకరాల్లో ప్రభుత్వ వైద్య కళాశాల, దోర్నాలలో గిరిజనులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు రూ.49.26 కోట్లతో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఏర్పాటు చేసేందుకు అవసరమైన పనులు పురోగతిలో ఉన్నాయి.
- ఇవి కాకుండా ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు, ఇతర పథకాలకు సంబంధించి వేల కోట్ల రూపాయలు లబ్ధిదారులకు అందాయి. పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం ద్వారా 2,579.55 ఎకరాల్లో 1,25,588 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించారు.

ప్రజలకు మెరుగైన పాలన అందిస్తాం



ప్రజలకు మెరుగైన పాలన అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్విభజన చేసింది. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పడిన జిల్లాకు కలెక్టర్‌గా వచ్చిన నేను మెరుగైన పాలన అందించడంతో పాటు ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేసేలా కృషి చేస్తాం. కొన్ని మండలాలు తగ్గినా ఎక్కువ విస్తీర్ణంతో పెద్ద జిల్లాగా మన జిల్లా ఉంది. నాలుగు నియోజకవర్గాలు తగ్గడంతో జిల్లాలో అధికార యంత్రాంగాన్ని గ్రామ స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు పక్కాగా పర్యవేక్షించేందకు అవకాశం ఎక్కువగా ఉంది. మొత్తం మీద కొత్త జిల్లాను రాష్ట్రంలో అన్నీ రకాలుగా మొదటి స్థానంలో నిలబెట్టేందుకు అందరి సహకారంతో కృషి చేస్తా.

– దినేష్‌కుమార్, కలెక్టర్

న్యూస్‌రీల్

ప్రభుత్వ జీవిత బీమా కార్యాలయం చిరునామా మార్పు

ఒంగోలు: ప్రభుత్వ జీవిత బీమా కార్యాలయం చిరునామా స్థానిక భాగ్యనగర్ రెండో లైను నుంచి మారినట్లు కార్యాలయం సహాయ సంచాలకుడు కేఎస్‌వీ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఎన్ఎస్‌పీ కాలనీలో ఆంధ్రకేసరి యూనివర్శిటీ సమీపంలో ప్రభుత్వం నూతనంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ కాంప్లెక్స్ రెండో అంతస్తులోని కార్యాలయంలోకి మార్చారని, జిల్లాలోని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కలెక్టర్‌కు సత్కారం



కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిసిన రెగ్యులర్ అయిన వీఆర్వోలు

ఒంగోలు అర్బన్: వీఆర్ఏలుగా ఉండి గ్రేడ్–2 వీఆర్వో (విలేజ్ రెవిన్యూ అధికారి)లుగా పదోన్నతి పొందిన 145 మంది వీఆర్వోలకు ప్రొబెషన్ పీరియడ్ ముగియడంతో కలెక్టర్ ప్రొబెషన్ డిక్లరేషన్ చేసి పే స్కేలు అందించడంతో వీఆర్వోలు సోమవారం ప్రకాశం భవనంలో కలెక్టర్‌ను కలిసి శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. దీనిలో వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు పీ రాము, ఇతర సభ్యులు ఉన్నారు.

ముగ్గురు సీఐలకు పోస్టింగ్

ఒంగోలు టౌన్: వీఆర్‌లో ఉన్న ముగ్గురు సీఐలకు పోస్టింగ్‌లు ఇస్తూ గుంటూరు రేంజి ఐజీ డాక్టర్ తివిక్రమ వర్మ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఆర్.రాంబాబుకు ఒంగోలు తాలుకా పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. అలాగే ఒంగోలు టూటౌన్‌కు ఎస్.జగదీష్, పీసీఆర్ సీఐగా ఓ.దుర్గా ప్రసాద్ ను బదిలీ చేశారు. వెంటనే ఈ ఉత్తర్వులు అమలులోకి రానున్నాయి.

చిరుధాన్యాలతో పోషకాహారం


- కలెక్టర్ దినేష్‌కుమార్



కలెక్టరేట్ ఆవరణలో ప్రకృతి ఉత్పత్తుల స్టాల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: చిరుధాన్యాలతో పోషకాహారం లభిస్తుందని తద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. సంపూర్ణ పోషణ–ఇంటింటా వెలుగు నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం గత నెల 20వ తేదీ నుంచి చేపట్టిన పౌష్టికాహార పక్షోత్సవాల ముగింపు కార్యక్రమం మహిళా శిశు సంక్షేమ శాఖ, డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో ప్రకాశం భవనంలో నిర్వహించారు. ఏర్పాటు చేసిన చిరుధాన్యాలు, ఇతర పోషక పదార్థాలతో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్ ప్రారంభించి ఆహార పదార్థాలు రుచి చూశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యకరమైన జీవితానికి బాల్యం నుంచే పోషకాహారం తీసుకోవడం అవసరమన్నారు. ఆ దిశగా బాలలకు, గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీల ద్వారా పోషకాహారం ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఐక్యరాజ్యసమితి కూడా చిరుధాన్యాల విలువను గుర్తించి వాటి వినియోగం పెంచేలా ఈ ఏడాదిని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా గుర్తించిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా చిరుధాన్యాల సాగుకు, వినియోగం పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. అదేవిధంగా కొత్తపట్నంలో సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసిన పంటలు ఇతర ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలను స్పందన భవనం వద్ద కలెక్టర్ ప్రారంభించారు. సేంద్రియ పద్ధతిలో పండించిన పంట ఉత్పత్తులు పెంచేలా కృషి చేస్తామన్నారు. కలెక్టర్‌తో పాటు ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ బాబురావు, మెప్మా పీడీ రవి కుమార్, సచివాలయాల కో ఆర్డినేటర్ ఉషారాణి, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి ఇతర అధికారులు ఉన్నారు.

కనిగిరికి కొత్త శోభ




కనిగిరి పట్టణ వ్యూ

కనిగిరి రూరల్: కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో కనిగిరికి కొత్త శోభవచ్చింది. కనిగిరి కేంద్రంగా పలు కార్యాలయాలు వచ్చాయి. ఇప్పటికే కొన్ని భవనాలు ప్రారంభోత్సవం కాగా, మరి కొన్ని కార్యాలయాలు తాత్కలిక భవనాల్లో కార్యాలయాలు నడుస్తున్నాయి. దీంతో వెనుకబడిన కనిగిరి ప్రాంత అభివృద్ధికి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ కృషికి మరింత ముందడుగులు పడుతున్నాయి. కనిగిరి రెవెన్యూ డివిజన్‌లోకి కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాలతో పాటు మర్కాపురం నియోజకవర్గం నుంచి రెండు (కొనకనమిట్ల, పొదిలి) మండలాలు, దర్శి నియోజకవర్గం నుంచి మూడు మండలాలు(దర్శి, దొనకొండ, కురిచేడు), కొండపి నియోజకవర్గం నుంచి రెండు మండలాలు (మర్రిపూడి, పొన్నలూరు) కలిపి కనిగిరి రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేశారు.

చేరువలో ఉన్నతాధికారుల సేవలు

ప్రధానంగా ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన రెవెన్యూ, వైద్య సేవలు కనిగిరి ప్రాంతానికి చేరాయి. ఇప్పటి వరకు ఆర్డీఓ, డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ, ఆర్టీఓ, డీఎస్పీ, డీఎల్‌పీఓ, డీఎల్‌డీఓ తదితర కార్యాలయ పనుల కోసం సుమారు 50 కి.మీ దూరం వెళ్లాల్సి వచ్చేది. రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో ఆ సమస్యలకు చెక్ పడింది. ఇప్పటికే ఆర్‌డీఓ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ, డీఎల్‌పీఓ, డీఎల్‌డీఓ, వంటి కీలక కార్యాలయల భవనాల ప్రారంభోత్సవాలు జరిగాయి. డీఎస్పీ, ఎంఐవీ కార్యాలయ భవనం ప్రారంభోత్సవాలకు కసరత్తు జరుగుతోంది. ఎంఐవీ కార్యాయలయాన్ని కంభం రోడ్డులోని మార్కెట్ యార్డ్ ఏరియాల్లో తాత్కలిక భవనాల్లో ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం దర్శి డీఎస్పీ కనిగిరికి ఇన్‌చార్జి అధికారిగా ఉన్నారు.



కనిగిరి రెవెన్యూ డివిజన్ మ్యాప్

పెరిగిన ఆదాయ వనరులు

కనిగిరి కేంద్రంగా ఆదాయ వనరులు భారీగా పెరిగాయి. కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో భూముల ధరలకు భారీగా రెక్కలొచ్చాయి. కనిగిరి రెవెన్యూ డివిజన్ కావడంతో వివిధ శాఖల అధికారుల ఉన్నతాధికారుల కార్యాలయాలు ఏర్పాటు కావడంతో 12 మండలాలకు చెందిన వారు అత్యధికంగా కనిగిరికి రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో వ్యాపారాలు మరింత పెరిగి ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి.

స్పాన్సర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు అర్బన్: భారత ప్రభుత్వం చేపట్టిన మిషన్ వాత్సల్య పథకం ద్వారా నిరాదరణకు గురైన బాలలకు విద్య, వైద్యం మెరుగైన భవిష్యత్తు కల్పించేందుకు స్పాన్సర్‌షిప్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చిన స్పాన్సర్ సహకారంతో అనాథలు, నిరాశ్రయులు, తల్లిదండ్రులను కోల్పోయిన వారికి, బాల కార్మికులకు ఇలా ప్రభుత్వం నిర్దేశించిన వర్గాల అభివృద్ధి కోసం ఒక్కొక్కరికి నెలకు రూ.4 వేల చొప్పున మిషన్ వాత్సల్య పథకం ద్వారా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా నిధులు అందజేస్తారన్నారు. స్పాన్సర్‌షిప్‌కు సంబంధించి సందేహాలు, వివరాలకు 94408 14506, 96764 04743 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

- రెగ్యులర్ పరీక్షలకు 226 మంది, ఓపెన్ పరీక్షలకు 367 మంది గైర్హాజరు
- కలెక్టర్, ఎస్పీతోపాటు తనిఖీలు నిర్వహించిన అధికారులు



పీవీఆర్ బాలుర హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు: పదో తరగతి పరీక్షలు జిల్లాలో సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. మొత్తం 175 సెంటర్లలో ఎటువంటి అవాంఛనీయ ఘటన చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు. పరీక్షల సందర్భంగా ఉదయం పోలీసులు ట్రాఫిక్ సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. పరీక్షలకు తొలిరోజు కావడంతో విద్యార్థులు ఉదయం 8 గంటల నుంచే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పోలీసులు 8.30 గంటల నుంచి విద్యార్థులను తనిఖీచేసి పరీక్ష కేంద్రంలోనికి పంపారు. పరీక్ష కేంద్రం లోపల విద్యార్థులకు అవసరమైన సహాయం అందించేందుకు, సూచనలు చేసేందుకు ప్రత్యేకంగా అధికారులు చొరవ చూపారు. సెల్‌ఫోన్ రహితంగా పరీక్షలు నిర్వహిస్తుండడంతో కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికాగర్గ్, జిల్లా పరీక్షల పరిశీలకులు ప్రసన్నకుమార్, డీఈవో పి.రమేష్ తదితరులు పలు సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

రెగ్యులర్ పరీక్షలకు 226 మంది గైర్హాజరు:

రెగ్యులర్ పదో తరగతి తెలుగు పరీక్షకు 28,954 మంది హాజరుకావాల్సి ఉండగా 28,728 మంది హాజరయ్యారు. 226 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పీవీఆర్ బాలికోన్నత పాఠశాలను సందర్శించగా, పరిశీలకులు ప్రసన్నకుమార్ టంగుటూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీచైతన్య పాఠశాల, సింగరాయకొండ, పొన్నలూరు, విప్పగుంటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. మరో వైపు జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ 8 పరీక్ష కేంద్రాలను, 62 స్క్వాడ్ బృందాలు 175 సెంటర్లకుగాను 77 పరీక్ష కేంద్రాలను తొలిరోజు తనిఖీ చేశారు.

ఓపెన్ పరీక్షలకు 367 మంది గైర్హాజరు:

ఓపెన్ స్కూల్ పరీక్షల్లో భాగంగా సోమవారం తొలిరోజు పదో తరగతికి తెలుగు, ఉర్దూ పరీక్ష జరిగింది. తెలుగుకు 1499 మందికి గాను 1306 మంది, ఉర్దూకు ముగ్గురు హాజరుకావాల్సి ఉండగా ముగ్గురు హాజరయ్యారు. ఇంటర్‌కు సంబంధించి తెలుగు, ఉర్దూ, హిందీ పరీక్షలు జరిగాయి. తెలుగుకు 4534 మందికిగాను 4173 మంది, ఉర్దూకు 19 మందికి 18 మంది, హిందీకి 40 మందికి 35 మంది హాజరయ్యారు. మొత్తంగా 4593 మందికి 4226 మంది మాత్రమే హాజరయ్యారు. డీఈవో పి.రమేష్ దర్శిలో 4 పరీక్ష కేంద్రాలను, రాష్ట్ర పరిశీలకులు 3, జిల్లా కోఆర్డినేటర్ 2, స్క్వాడ్ బృందాలు 21 సెంటర్లను తనిఖీ చేశాయి. మొత్తం 31 సెంటర్లకుగాను పామూరు మినహా అన్ని పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని డీఈవో పి.రమేష్ పేర్కొన్నారు.

నేడు విధిగా ఉదయం 7.30 గంటలకే పాఠశాలకు చేరుకోవాలి:

పదో తరగతి పరీక్ష మంగళవారం లేనందున అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలు ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించాలని డీఈవో పి.రమేష్ ఆదేశించారు. పరీక్షల విధుల్లో ఉన్న చీఫ్ సూపరింటెండెంట్లతోపాటు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది కూడా తప్పనిసరిగా వారివారి పాఠశాల విధులకు హాజరుకావాలన్నారు. పదో తరగతి విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా ఆదేశాలు జారీచేయాలని, వారికి మరుసటిరోజు పరీక్షకు సంబంధించిన ముఖ్యాంశాలను వివరించడంతోపాటు వారిని చదివించాలన్నారు. ఉదయం 10.30 గంటలకు రాగిజావ అందించాలని, మధ్యాహ్నం 12.30 గంటలకు జగనన్న గోరుముద్ద అందించి అనంతరం విద్యార్థులను ఇళ్లకు పంపాలన్నారు.

చిత్తశుద్ధితోనే ప్రజా సమస్యల పరిష్కారం

- కలెక్టర్ దినేష్ కుమార్



స్పందనలో అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ దినేష్ కుమార్, జేసీ అభిషిక్త్ కిషోర్

ఒంగోలు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేసిందని, అందుకే స్పందన ప్రజా సమస్యల పరిష్కారం వేదిక కార్యక్రమాన్ని ప్రాధాన్యతగా తీసుకుందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. జిల్లా యంత్రాంగం ప్రజా సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. ప్రజలు అందజేసిన అర్జీల తాలూకు సమస్యలు తిరిగి పునరావృతం కాకుండా క్షేత్ర స్థాయిలో పరిష్కరించాలన్నారు. ఈ అంశంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహించి దూర ప్రాంత ప్రజల సమస్యలను ఫోన్ ద్వారా తెలుసుకుని సంబంధిత అధికారులను పరిష్కరించాలని ఆదేశించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, డీఆర్ఓ ఆర్ శ్రీలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లోకేశ్వరరావు, హెలాషారోన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారి మాధురి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

- తర్లుపాడు మండలం పూతలపాడు గ్రామానికి చెందిన ఆర్ చిట్టిబాబు వైఎస్ఆర్ జలకళ పథకం ద్వారా వ్యవసాయ బోరు వేశారని, అయితే అందుకు సంబంధించిన పరికరాలు ఇవ్వలేదని తెలిపారు. పరిశీలించి త్వరగా పరికరాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
- త్రిపురాంతకం మండలం రామసముద్రం గ్రామానికి చెందిన టీ పెదవెంకటరెడ్డి తనకు సర్వ నంబర్ 11–4లో వారసత్వంగా వచ్చిన భూమి ఉందని అయితే ఆ భూమిని వేరే వ్యక్తుల పేరుతో ఆన్‌లైన్ చేశారని ఫిర్యాదు చేశారు. పరిశీలించి తన వారసత్వ భూమిని తన పేరుతో ఆన్‌లైన్ చేసేలా చూడాలని కోరారు.
- తాళ్లూరు మండలం తూర్పుగంగవరం గ్రామానికి చెందిన జాన్‌రాజు స్పందనలో అధికారులను కలిసి తాను వికలాంగుడినని పేద కుటుంబం కావడంతో జరుగుబాటు కష్టంగా ఉందని పీజీ వరకు చదువుకున్న తనకు ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశాడు.

రేపు జగ్జీవన్‌రాం జయంతి

ఒంగోలు: డాక్టర్ బాబూజగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా స్థానిక నెల్లూరు బస్టాండు వద్ద ఆయన విగ్రహానికి బుధవారం ఉదయం 10 గంటలకు నివాళులర్పించనున్నట్లు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. 10.15 గంటలకు అంబేద్కర్ భవన్ మార్గంలోని జగ్జీవన్‌రాం విగ్రహానికి పూష్పాలంకరణ, 10.30 గంటలకు అంబేద్కర్ భవన్‌లో జయంతి సభ నిర్వహించనున్నట్లు వివరించారు. అధికారులు, రాజకీయ, దళిత నాయకులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

మెసేజ్‌లతో వల.. ఖాతాలో రూ.లక్ష మాయం

● స్పందనలో ఎస్పీ మలికా గర్గ్‌కు బాధితుడి ఫిర్యాదు

ఒంగోలు టౌన్: ఫోన్‌పే ద్వారా రూ.722తో రెండు సార్లు మొబైల్ రీచార్జ్ చేసుకున్న వ్యక్తికి సైబర్ నేరగాళ్లు మెసేజ్‌లతో వల వేసి బ్యాంక్ ఖాతాలోని లక్ష రూపాయలు కాజేశారు. ఈ మేరకు నాగులప్పలపాడు గ్రామానికి చెందిన బాధితుడు లక్ష్మీనారాయణ సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఎస్పీ మలికా గర్గ్‌కు ఫిర్యాదు చేశారు. ఫోన్‌పే ద్వారా రెండు సార్లు రీచార్జి చేసుకున్నా నగదు జమకాకపోవడంతో కస్టమర్ కేర్‌కు ఫిర్యాదు చేయగా తన వాట్సప్‌కు ఒక మెసేజ్ వచ్చిందని తెలిపారు. అది ఓపెన్ కాకపోవడంతో తన ఫోన్ నంబరు తీసుకుని మెసేజ్‌లు పంపారని, అందులో ఇచ్చిన ఫోన్ నంబర్‌కు వివరాలు పంపించాలని సూచించడంతో అలాగే చేశానని, ఈలోగా తన బ్యాంకు ఖాతా నుంచి విడతల వారీగా లక్ష రూపాయలు మాయం అయ్యాయని గోడు వెళ్లబోసుకున్నాడు.

తనకు ఫారెస్టు లేదా విద్యా శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మబలికి కర్నూలు జిల్లాకు చెందిన కృష్ణయ్య అనే వ్యక్తి మోసం చేసినట్లు కనిగిరి మండలానికి చెందిన ఎం.కిశోర్ ఫిర్యాదు చేశారు. తన వద్ద నుంచి రూ.4,96,500 తీసుకుని స్పందించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసు స్పందనకు మొత్తం 161 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడిన ఎస్పీ మలికా గర్గ్ వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి స్పందన అర్జీల పరిష్కారంపై ఆరా తీశారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అంకిత సురాన, ఏఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, దిశ డీఎస్పీ పల్లపురాజు, ట్రాఫిక్ డీఎస్పీ విక్రమ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ మలికా గర్గ్

పారిశ్రామిక అభివృద్ధికి కృషి చేయాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: పారిశ్రామిక అభివృద్ధి, ఎగుమతులను పెంచితే ప్రభుత్వానికి ఆదాయం రావడంతో పాటు జిల్లాలోని యువతకు ఉపాధి లభిస్తుందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. ప్రకాశంభవనంలో సోమవారం జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పారిశ్రామిక అభివృద్ధితో పాటు తృణధాన్యాల ఉత్పత్తి, రైతులకు రాబడులు, తాగునీటి సంస్థలపై నిఘా తదితర అంశాల్లో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రాయితీ దరఖాస్తులను ప్రణాళికాబద్ధంగా పరిశీలించి జారీ చేయాలన్నారు. సమావేశంలో 519 క్లెయిమ్‌లకు సంబంధించి సుమారు రూ.16కోట్ల మంజూరుకు తీర్మానించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ మధుసూధన్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ బాబురావు, మెప్మా పీడీ, ఎల్‌డీఎం ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మార్కాపురం: ప్రమాదవశాత్తు బైక్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని ఇడుపూరు గ్రామ శివారులో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన డి ఏసులు (35) బైక్‌పై మార్కాపురం నుంచి గ్రామానికి వస్తుండగా గ్రామం మొదట్లో మలుపులో ఉన్న గుంత గమనించక అందులో పడడంతో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.


సంఘటన స్థలంలో మృతదేహం

విమర్శలకు తావులేకుండా టెన్త్ పరీక్షలు

● ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: ఒంగోలులోని క్విజ్ హైస్కూల్, సెయింట్ జేవియర్ జూనియర్ కాలేజీ, పేర్నమిట్టలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఎస్పీ మలికా గర్గ్ పరిశీలించారు. కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఆమె.. బందోబస్తు విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలిచ్చారు. విమర్శలకు తావులేకుండా పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణ తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, 144 సెక్షన్ అమలు చేస్తున్నామని వివరించారు. ప్రశ్నపత్రాలు, సమాధాన పత్రాల తరలింపునకు ఎస్కార్ట్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా పోలీసు శాఖ తరఫున అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ఒంగోలు డీఎస్పీ యు.నాగరాజు తదితరులు ఉన్నారు.


పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

జీవిత ప్రయాణంలో తిరిగిరాని లోకాలకు..



యూసూఫ్(ఫైల్)

ఒంగోలు టౌన్: కొనకనమిట్ల మండలం గొట్లగట్టు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒంగోలుకు చెందిన ముగ్గురు వ్యక్తులు మరణించిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో మృతి చెందిన వారిలో షేక్ యూసుఫ్‌ది గుంటూరు జిల్లా. మిర్చియార్డులో పనిచేసే తండ్రి నూరుల్లా అనారోగ్యంతో మరణించాడు. దీంతో యూసఫ్ ఒంగోలుకు వచ్చి మంగమూరు రోడ్డులోని విశ్వేశ్వర అపార్టమెంట్‌లో నివాసముంటున్నారు. ఆయనకు పదేళ్లు, ఐదేళ్లు వయసున్న ఇద్దరు కుమారులు. ఎంబీఏ చదివిన యూసఫ్ మూడు నెలల క్రితం వాసు ఆర్గానిక్స్ కంపెనీలో రిప్రజెంటేటివ్‌గా చేరాడు. కంపెనీ పనిపై గిద్దలూరు వెళ్లివస్తూ మార్గమధ్యంలో ప్రాణాలు కోల్పోయాడు. యూసుఫ్ మరణం విషయం తెలిసిన ఆయన భార్య షేక్ షీమా కన్నీరు మున్నీరుగా విలపించింది. ఊరికి వెళ్లిన నాన్న ఇక రాడని తెలియని ఆ చిన్నారులు బిత్తరచూపులు చూస్తుండడం చూపరులను కంటతడి పెట్టిస్తుంది.

▶ రాంనగర్ రెండో లైనులో నివాసం ఉండే బెజవాడ నాగేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. వెంకటేశ్వర్లు గతంలో హోటల్ నిర్వహించాడు. గ్రానైట్ కంపెనీలో ఉద్యోగం చేశారు. అది కూడా కలిసి రాకపోవడంతో కొద్దికాలం క్రితం మెడికల్ రెప్రజెంటేటివ్‌గా చేరారు. ఇప్పుడిప్పుడే జీవితంలో నిలదొక్కుకునే సమయంలో విధి వక్రీకరించింది. ఆదివారం మనవరాలి తొలి పుట్టినరోజును చేసిన ఆయన.. అదే సంతోషంతో విధి నిర్వహణకు వెళ్లాడు. ప్రమాదంలో మరణించిన విషయం తెలిసి ఆ తల్లీ పిల్లలు తల్లడిల్లిపోతున్నారు.


వెంకటేశ్వర్లు (ఫైల్)

▶ కామేపల్లికి చెందిన తక్కెళ్లపాడు శ్రీనివాసరావు ఒంగోలులోని కమ్మపాలెం కాళికాదేవి అమ్మవారి దేవాలయం వెనక వీధిలో నివాసముంటున్నారు. కాస్మోస్ కంపెనీ మేనేజర్‌గా పనిచేస్తున్న ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు వెంకట్ అమెరికాలో ఎంఎస్ చేస్తున్నాడు. చిన్న కుమారుడు శివసాయి విజయవాడలో బీబీఎం చదువుతున్నాడు. ఒకే ప్రమాదంలో ముగ్గురు మెడికల్ రంగానికి చెందిన వారు మృతి చెందడంతో మెడికల్ వ్యాపారుల్లో విషాదం నెలకొంది. మృతుల జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ పలువురు సన్నిహితులు కన్నీరు పెట్టుకుంటున్నారు.


శ్రీనివాసరావు(ఫైల్)